# ఇండియన్ పాలిటీ

## ఎన్నికల సంస్కరణలు

### కమిటీల సిఫార్సులు

ఎన్నికల విధానంలో మార్పుల అధ్యయనానికి అనేక కమిటీలు సిఫార్సులు చేశాయి...

**సంయుక్త పార్లమెంటరీ కమిటీ (1972):** అయిదేళ్లకు ఒకసారి దేశ వ్యాప్తంగా నిర్వహించే సార్వత్రిక ఎన్నికలు, శాసనసభలు, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి ఎన్నికలను ఒకే వ్యక్తి పర్యవేక్షించడం, నియంత్రించడం శ్రమతో కూడిన పని. దీనివల్ల సంబంధిత వ్యక్తి నిరంకుశత్వంతో వ్యవహరించే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆర్టికల్ 324(2) ప్రకారం కేంద్ర ఎన్నికల సంఘాన్ని బహుళ సభ్య ఎన్నికల సంఘంగా మార్చాలి.

**వి.ఎం.తార్కుండే కమిటీ (1982):** లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ జనతంత్ర సమాజ్ తరపున ఎన్నికల విధానంలో మార్పుల అధ్యయనానికి వి.ఎం.తార్కుండే కమిటీని ఏర్పాటుచేశారు.

- కేంద్ర ఎన్నికల సంఘం ముగ్గురు సభ్యులతో స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన సంస్థగా ఉండాలి. పదవీ విరమణ చేసిన ప్రభుత్వోద్యోగులను ఎన్నికల సంఘం సభ్యులుగా నియమించకూడదు.
- సుప్రీంకోర్టు న్యాయమూర్తి అయ్యే అర్హతలు ఉన్నవారినే ఎన్నికల సంఘం సభ్యులుగా నియమించాలి.

**దినేష్ గోస్వామి కమిటీ (1990):** వి.పి.సింగ్ ప్రభుత్వంలో న్యాయశాఖ మంత్రిగా పనిచేసిన దినేష్ గోస్వామి అధ్యక్షతన ఎన్నికల సంస్కరణలపై సిఫార్సులకు కమిటీని ఏర్పాటుచేశారు.

- ఎన్నికల్లో పోటీచేసే రాజకీయ పార్టీలకు ప్రభుత్వం ఎన్నికల నిర్వహణ ఖర్చును నగదు రూపంలో కాకుండా వస్తురూపంలో ఇవ్వాలి. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు మాత్రమే ప్రభుత్వం ఆర్థిక సహకారాన్ని అందించాలి. మిగిలిన పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత ఆర్థిక సహాయం చేయాలి.
- ఎన్నికల పరిశీలనకు ఒక పర్యవేక్షణాధికారిని నియమించే అధికారాన్ని ఎన్నికల సంఘానికి ఇవ్వాలి. ఒక అభ్యర్థి ఒకేసారి రెండు నియోజకవర్గాల నుంచి పోటీచేసే విధానాన్ని రద్దు చేయాలి. ఎన్నికల్లో జరిగే అక్రమాలను నియంత్రించేందుకు ఈవీఎంలను ఉపయోగించాలి.
- రిజర్వ్ చేసిన నియోజకవర్గాలను నియమిత కాలాల్లో మారుస్తూ రిజర్వేషన్ లేని అభ్యర్థులకు అవకాశం కల్పించాలి. పోలింగ్‌బూత్‌ల ఆక్రమణ, రిగ్గింగ్ జరిగినప్పుడు ఓట్ల లెక్కింపును నిలిపివేసి ఫలితాలను వెల్లడించరాదని ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారులను ఆదేశించాలి.
- ఎన్నికల వ్యయానికి సంబంధించిన అంశాలను పరిశీలించి ప్రభుత్వమే అన్ని రాజకీయ పార్టీలకు ఎన్నికల వ్యయాన్ని సమకూర్చాలి. దీనికి సంబంధించి ప్రైవేట్ వ్యక్తులు, సంస్థల నుంచి ఎలాంటి ఆర్థిక సహాయం ఉండకూడదు.

**15వ లా కమిషన్:** జస్టిస్ జీవన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన 15వ లా కమిషన్ కొన్ని సిఫార్సులను చేసింది.

- ✦ అధికంగా ఓట్లు పోలైన వారే గెలిచినట్లు ప్రకటించే ప్రస్తుత విధానంలో రెండంచెల బ్యాలెట్ విధానాన్ని ప్రవేశపెట్టాలి. పార్టీ ఫిరాయింపుదారులను అనర్హులుగా ప్రకటించే అధికారం ఎన్నికల సంఘానికి ఉండాలి. ప్రభుత్వాన్ని కూలదోసేందుకు ఫిరాయింపుదారులు వేసే ఓట్లు చెల్లవని ప్రకటించాలి.
- ✦ ఒక రాజకీయ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో మహిళలకు 30% సీట్లను రిజర్వు చేయాలి. రాజకీయ పార్టీలకు విరాళాలు ఇచ్చేందుకు ప్రత్యేక ఎన్నికల ట్రస్టు ఏర్పాటుచేసేలా కార్పొరేట్ సంస్థలను ప్రోత్సహించాలి.
- ✦ ఒక అభ్యర్థి ఒకటి కంటే ఎక్కువ నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు అనుమతించకూడదు. వారి నేరచరిత్ర గురించి తెలిసి కూడా ఏదైనా రాజకీయ పార్టీ టికెట్ ఇస్తే సంబంధిత పార్టీ గుర్తింపు, రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలి.
- ✦ ఎన్నికల్లో పోటీచేసే స్వతంత్ర అభ్యర్థులు మరణించినప్పుడు ఎన్నికను వాయిదా వేయాల్సిన అవసరం లేదు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీకి చెందిన అభ్యర్థి మరణిస్తే కొత్తవారిని సూచించడానికి వారం రోజుల సమయాన్ని ఇవ్వాలి.

## రెండో పరిపాలనా సంస్కరణల సంఘం

- వీరప్ప మొయిలీ అధ్యక్షతన డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో నియమించిన రెండో పరిపాలనా సంస్కరణల సంఘం ఎన్నికలకు సంబంధించిన సిఫార్సులు చేసింది. పార్టీ ఫిరాయించిన రాష్ట్ర శాసన, లోక్‌సభ సభ్యులను అనర్హులుగా ప్రకటించే అధికారం గవర్నర్, రాష్ట్రపతికి కల్పించాలి.
- ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్‌ల నియామకం పారదర్శకంగా జరగాలి. ప్రధానమంత్రి నాయకత్వంలోని ఎంపిక కమిటీ సిఫార్సుల మేరకు వీరిని రాష్ట్రపతి నియమించాలి.
- అధికార కూటమి నుంచి ఏదైనా రాజకీయ పార్టీ అర్ధాంతరంగా విడిపోయినట్లయితే ఆ పార్టీ తిరిగి ప్రజల తీర్పును కోరే విధంగా చట్టంలో మార్పులు చేయాలి.
- ఎన్నికలకు సంబంధించిన వివాదాలను 6 నెలల్లోపు పరిష్కరించేందుకు ప్రత్యేక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయాలి. పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో భాగంగా అభ్యర్థుల ఖర్చులో కొంతభాగాన్ని ప్రభుత్వం భరించాలి.
- కేంద్ర ప్రభుత్వ ఏర్పాటులో భాగస్వామ్యం కలిగిన రాజకీయ పార్టీలు ఎన్నికల కూటమిగా ఏర్పడినప్పుడు ఎన్నికల ముందు లేదా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత కనీస ఉమ్మడి కార్యక్రమాన్ని ప్రకటించాలి.
- హత్య, అత్యాచారం, దొంగతనం, అపహరణ లాంటి నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారికి పార్లమెంటు, శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడానికి పార్టీలు టికెట్లు ఇవ్వకూడదు.

## టి.ఎస్.కృష్ణమూర్తి కమిటీ

- 13వ ప్రధాన ఎన్నికల కమిషనర్ టి.ఎస్.కృష్ణమూర్తి ఎన్నికల సంస్కరణల గురించి కొన్ని సిఫార్సులు చేశారు.
- ఎన్నికల్లో ఒక అభ్యర్థి ఒక నియోజకవర్గం నుంచి మాత్రమే పోటీచేయడానికి అనుమతించాలి. ఓటరుకు పోటీచేసే ఏ అభ్యర్థికి ఓటువేయడం ఇష్టం లేకపోతే వారందరినీ తిరస్కరించే అవకాశాన్ని కల్పించాలి. దాని కోసం బ్యాలెట్ పేపర్‌లో ఒక కాలమ్‌ను ఏర్పాటుచేయాలి.
- ఎగ్జిట్ పోల్స్‌ను నియంత్రించాలి. టీవీ ప్రకటనలకు సంబంధించిన విషయాలపై నియమావళిని రూపొందించాలి.
- అయిదేళ్ల పాటు జైలుశిక్ష విధించదగిన నేరాలకు పాల్పడినట్లుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను నిర్దోషులని రుజువయ్యేంత వరకు ఎన్నికల్లో పోటీచేయడానికి అనర్హులుగా ప్రకటించాలి.

## రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్

- అటల్ బిహారీ వాజ్‌పేయీ ప్రభుత్వం ఎం.ఎన్.వెంకటాచలయ్య అధ్యక్షతన ఏర్పాటుచేసిన రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్ ఎన్నికల వ్యవస్థకు సంబంధించిన సిఫార్సులను చేసింది.
- ప్రధానమంత్రి, ముఖ్యమంత్రిని చట్టసభల సభ్యులు ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి. సభానాయకుడిపై (ప్రధానమంత్రి లేదా ముఖ్యమంత్రి) అవిశ్వాస తీర్మానాన్ని ప్రతిపాదించే సమయంలోనే ప్రత్యామ్నాయ నాయకత్వాన్ని కూడా చూపాలి.
- దిగువసభ సభ్యుల సంఖ్యలో మంత్రిమండలి సభ్యుల సంఖ్య 10%కి మించకూడదు.
- పంచాయతీ స్థాయి నుంచి ఓటర్లకు సంబంధించిన మొత్తం సమాచారాన్ని సేకరించి మొదట పోస్టాఫీసుల్లో ప్రదర్శించి మార్పులు చేసిన తర్వాత వెబ్‌సైట్‌లో పొందుపరచాలి.
- అన్ని నియోజకవర్గాల్లో వీలైనంత త్వరగా ఈవీఎంలను ప్రవేశపెట్టాలి.
- ఎస్సీ, ఎస్టీలకు రిజర్వు చేసిన నియోజక వర్గాలను రొటేషన్ పద్ధతిలో మార్చాలి.
- ఎన్నికల్లో పోలైన ఓట్లలో కనీసం 50% + 1 ఓట్లు సాధించిన అభ్యర్థులనే గెలుపొందినట్లుగా ప్రకటించాలి. ఏ పార్టీకి లేదా ఎన్నికల ముందు ఏర్పడిన కూటమికి స్పష్టమైన మెజార్టీ రానట్లయితే స్పీకర్‌ను ఎన్నుకున్న విధంగానే సభానాయకుడిని కూడా చట్టసభల సభ్యులే ఎన్నుకోవాలి.

## మాదిరి ప్రశ్నలు

**1.** జనతంత్ర సమాజ్ తరపున ఎన్నికల సంస్కరణల కోసం వి.ఎం.తార్కుండే కమిటీని ఎవరు నియమించారు?

1) వినోభాబావే  2) జవహర్‌లాల్ నెహ్రూ

3) జయప్రకాష్ నారాయణ్  4) మొరార్జీదేశాయ్

**2.** 1990లో వి.పి.సింగ్ ప్రభుత్వ కాలంలో ఎన్నికల సంస్కరణలపై అధ్యయనం కోసం నియమించిన కమిటీ?

1) రంగనాథన్ కమిటీ  2) దినేష్ గోస్వామి కమిటీ

3) వోహ్రా కమిటీ  4) కె.ఎన్.సింగ్ కమిటీ

**3.** రాజకీయ పార్టీ సంస్థాగత ఎన్నికల్లో మహిళలకు ఎన్ని సీట్లు రిజర్వు చేయాలని జస్టిస్ జీవన్‌రెడ్డి అధ్యక్షతన ఏర్పాటైన 15వ లా కమిషన్ సిఫార్సు చేసింది?

1) 1%  2) 21%  3) 30%  4) 33%

**4.** అటల్‌బిహారి వాజ్‌పేయీ ప్రభుత్వ కాలంలో ఏర్పాటైన రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్ అధ్యక్షుడు?

1) ఎం.ఎన్.వెంకటాచలయ్య  2) రంగనాథ్ మిశ్రా

3) వీరప్ప మొయిలీ  4) కె.హనుమంతరావు

**5.** ఎన్నికల్లో పోలైన ఓట్లలో కనీసం 50% + 1 ఓట్లు సాధించిన అభ్యర్థులనే గెలుపొందినట్లుగా ప్రకటించాలని ఎవరు సిఫార్సు చేశారు?

1) దినేష్ గోస్వామి కమిటీ  2) 15వ లా కమిషన్

3) రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్  4) సంయుక్త పార్లమెంటరీ కమిటీ

**6.** డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రభుత్వ కాలంలో ఏర్పాటుచేసిన రెండో పరిపాలనా సంస్కరణల సంఘానికి నాయకత్వం వహించినవారు?

1) వీరప్ప మొయిలీ  2) మదన్‌మోహన్ పూంఛీ

3) బిమల్ జలాన్  4) రంగరాజన్

**7.** ఎన్నికలకు సంబంధించిన వివాదాలను ఆరు నెలల్లోపు పరిష్కరించేందుకు ప్రత్యేక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేయాలని ఎవరు సిఫార్సు చేశారు?

1) వి.ఎం.తార్కుండే కమిటీ  2) దినేష్ గోస్వామి కమిటీ

3) రాజ్యాంగ పునఃసమీక్ష కమిషన్  4) రెండో పరిపాలనా సంస్కరణల సంఘం

**8.** ఎంపీ లాడ్స్, ఎమ్మెల్యే లాడ్స్ పథకాలను రద్దు చేయాలని ఎవరు సిఫార్సు చేశారు?

1) టి.ఎన్.శేషన్  2) రాజ్యాంగ పునః సమీక్ష కమిషన్

3) రెండో పరిపాలనా సంస్కరణల సంఘం  4) టి.ఎస్.కృష్ణమూర్తి

**9.** జాతీయ గౌరవ భంగాన్ని నిరోధించే చట్టం, 1971ను ఉల్లంఘించినవారు ఎన్నేళ్లపాటు ఎన్నికల్లో పోటీ చేయడానికి అనర్హులు?

1) 3  2) 6  3) 7  4) 10

### సమాధానాలు

1-3; 2-2; 3-3; 4-1; 5-3; 6-1; 7-4; 8-3; 9-2.

**రచయిత: బంగారు సత్యనారాయణ**

www.eenadupratibha.net